హైదరాబాద్ వార్త

# డెంగ్యూ క్యూ..! ఆస్పత్రులు హౌస్‌ఫుల్

## నగరాన్ని వణికిస్తున్న విష జ్వరాలు




**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:**
డెంగీ ప్రమాదఘంటికలు మోగిస్తోంది. నగరంలో కొంత కాలంగా డెంగ్యూ పాజిటివ్ కేసుల సంఖ్య అధికమవుతోంది. దోమలనియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిహెచ్‌ఎంసి, శివారు మున్సిపాలిటీల అధికారులు పేర్కొంటున్నా, అడుగడుగునా చెత్తకుప్పలు, డ్రైనేజీ మురుగుతో రోడ్లు కంపుకొట్టడానికి తోడు తరచుగా కురుస్తున్న వర్షాలతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో జనానికి కంటిమీద కునుకు కరువవుతోంది. జ్వరంరాగానే డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలన్నీ చేయించుకుంటున్నారు. మూడేళ్ళతర్వాత మళ్ళీ డెంగ్యూకేసుల్లో పెరుగుదల కనిపిస్తుందని వైద్యవర్గాలు వెల్లడించాయి.

డెంగ్యూ దోమలు పసిపిల్లలపై పంజా విసురుతున్నాయి. తీవ్రమైనజ్వరం, జలుబుతో బాధపడుతూ ఆస్పత్రులకు చేరుతున్న చిన్నారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నిలోఫర్ ప్రభుత్వ నవజాత శిశువుల ఆరోగ్యకేంద్రంసహా నగరంలోని పలు ప్రైవేటు చిన్నపిల్లల ఆస్పత్రులు సైతం జ్వర బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని పీడియాట్రిక్ విభాగాలన్నీ హౌస్‌ఫుల్ కావడంతో పడకల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. వైద్యం అటుంచి.. కనీసం పడుకునేందుకు బెడ్ దొరికితే చాలు అన్నట్లుగా ఉంది. గ్రేటర్‌లో బాధితుల్లో 50శాతం మంది 14 ఏళ్లలోపుపిల్లలే కావడం గమనార్హం. జ్వరపీడితుల్లో నిలోఫర్, గాంధీ పీడియాట్రిక్ వార్డులు పూర్తిగా నిండిపోయాయి. ఇక నిలోఫర్ ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు పిల్లలను ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్స్‌లను ఆశ్రయిస్తున్నారు. తీరా అక్కడ కూడా చేదు అనుభవమే ఎదురవుతోంది. రోజురోజుకు పెరుగుతున్న రోగులరద్దీ దృష్ట్యా జ్వరం పూర్తిగా తగ్గకుండానే బాధితులను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసి కొత్తవారిని అడ్మిట్ చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని ప్రైవేటు వైద్యులు పేర్కొంటున్నారు. ఇక ప్రభుత్వ, ప్రైవేటు ఆసపత్రుల్లో నమోదవుతున్న డెంగీకేసుల వివరాలు గోప్యంగా ఉంచుతుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**బాధితుల్లో చిన్నపిల్లలే ఎక్కువ..**

పెద్దలతో పోలిస్తే చిన్నపిల్లల్లో రోగ నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. సీజన్ మారినప్పుడు పలువురుచిన్నారులు జ్వరం, దగ్గు, జలుబు, నిమోనియాతో బాధపడుతుంటారు. డెంగ్యూదోమలు ఎక్కువగా పగటిపూట కుడుతుంటాయి. మూడేళ్లలోపు చిన్నపిల్లలు ఎక్కువగా పగటిపూట నిద్రపోతుంటారు. కాళ్లు, చేతులు పూర్తిగా కవర్‌చేసే దుస్తులకు బదులు ఆఫ్‌షర్ట్స్, షార్ట్స్ ధరిస్తుంటారు. వీరిని దోమలుకుట్టడంతో త్వరగా డెంగ్యూబారినపడుతుంటారు. ఇక స్కూలుపరిసరాల్లో పారిశుధ్యలోపంతో విద్యార్థులకు జ్వరాలు వస్తున్నాయి. డెంగ్యూ జ్వరం 'ఏడిస్ ఈజిప్ట్' అనే ఆడదోమ పగటిపూట నొప్పిరాకుండా కుట్టడంవల్ల వస్తుందని, నియో బిబిసి చిల్డ్రన్ ఆస్పత్రి ఎండి, ప్రముఖ పిల్లలవైద్యనిపుణలు డాక్టర్ మంజుకొండ రంగయ్య పేర్కొన్నారు. డెంగ్యూబారిన పడకుండా పిల్లలకు పూర్తి రక్షణ కల్పించాలని ప్రతి ఇంటిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డెంగ్యూ వ్యాధికికారణం, వ్యాధిరాకుండా తీసుకునే జాగ్రతలను ఆయన వివరించారు. డెంగ్యూ జ్వరం రావడానికి దోమకాటునుంచి ఐదునుంచి ఎనిమిది రోజుల సమయం పట్టవచ్చని తెలిపారు.

**టెస్టుల పేరుతో ఫీజుల దోపిడీ..**

జనాల్లో డెంగ్యూ భయం పెరగడంతో ఇదే అదనుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీకి తెగబడ్డాయి. మూడురోజులకు మించి ఫీవర్ తగ్గకపోతే వెంటనే ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. దీంతో ఇదే అదనుగా ప్రైవేటు హాస్పిటల్స్ దోపిడీకి తెరలేపుతున్నాయి. నార్మల్ ఫీవర్‌తో వెళ్లినా లేనిపోని టెస్టులు చేసి ప్లేట్‌లెట్స్ తగ్గాయని, ఆలస్యంచేస్తే పరిస్థితి సీరియస్ అవుతుందని భయపెడుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ కౌంట్ లక్ష కంటే ఏమాత్రం తగ్గినా ప్లేట్‌లెట్ రెడీ చేసుకోవాలని సూచిస్తుండడంతో రోగుల బంధువుల్లో టెన్షన్ మొదలవుతోంది. ఈ వ్యాధులకు ప్రమాదన కారణం దోమలు అని తెలిసి వాటిని పూర్తిగా నివారించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. విష జ్వరాలతో డెంగ్యూ బారినపడుతున్నది ఎక్కువగా మురికివాడలకుచెందిన పిల్లలే కావడంతో వారిలో పేదవారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తుండగా, కొద్దిగా స్తోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. విష జ్వరాలో అంత పెద్ద ప్రమాదం లేప్పటికీ డెంగ్యూతో పెద్ద ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువమంది డెంగ్యూ షాక్ సింద్రోమ్‌తో చేరుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. శరీరంలో ప్లేట్‌లెట్లు తగ్గిపోయి, రక్తస్రావం అవుతున్న క్రమంలో ఆసుపత్రికి వస్తున్నారు. కొందరిలో పరిస్థితి విషమంగా మారుతోందని అంటున్నారు. ముందే మేలుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**రోగులకు అవసరం లేకున్నా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్న వైనం..**

గతంలో కరోనా బాధితులను పీల్చి పిప్పిచేసిన అనేక ప్రైవేటు ఆసుపత్రులు.. ఇప్పుడు డెంగ్యూ రోగులజేబులు గుల్లచేస్తున్నాయి. తప్పుడు రిపోర్టుల్లో ప్లేట్‌లెట్ల సంఖ్యను తక్కువగా చూపిస్తున్నాయి. ప్లేట్‌లెట్లు అవసరం లేకపోయినా ఎక్కిస్తూ డబ్బులు గుంజుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసరంగా ఫీజులు వసూలు చేయొద్దని వైద్య ఆరోగ్యశాఖ పదేపదే చెబుతున్నా కొన్ని ఆసుపత్రులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు వసూలు చేస్తూ రోగుల్ని ఇబ్బందులపాలు చేస్తున్నాయి. రోగికి 50వేలకు పైగా ప్లేట్‌లెట్లు ఉన్నా ఐసియూలో ఉంచి అదనంగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. నాలుగైదు రోజులు ఉంచుకొని భారీ ఎత్తున బిల్లులు వేసి వసూలు చేస్తున్నట్టుగా ఫిర్యాదులు అందుతున్నాయి. డెంగ్యూ లేకపోయినా, ప్లేట్‌లెట్ల కౌంట్ సరిపడా ఉన్నా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# కమిషనర్ ఆదేశాలు బేఖాతరు..!

-నగరంలో కొనసాగుతున్న సెల్లార్ల తవ్వకాలు
-వర్షాకాలం ముగిసేవరకు నిషేధించినా పట్టించుకోని వైనం
-చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు



**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:**
మాన్‌సూన్ ముగిసేవరకు సెల్లార్ల తవ్వకాలు నిషేధించినప్పటికీ నగరంలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా సెల్లార్ల తవ్వకాలు చేపడుతున్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో సెల్లార్ ప్రమాదాలు జరుగుతాయని తెలిసినా.. ఉదాసీన వైఖరి అవలంబించడం బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులకు పరిపాటిగా మారిపోయింది.

ఐదు నెలల కిందటే ఎల్‌బినగర్‌లోని ఒక నిర్మాణ స్థలంలో సెల్లార్ కూలి ముగ్గురు కార్మికులు మరణించిన సంఘటనను బల్దియా అధికారులు అప్పుడే మరిచిపోయినట్లు ఉన్నారు. గత నెల మే 30న జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సెల్లార్ల తవ్వకాలు చేపట్టవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ కమిషనర్ ఆదేశాలను క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది బేఖాతర్ చేస్తున్నారు. పైగా సెల్లార్ల తవ్వకాలను ఆపేందుకు ఎటువంటి ప్రయత్నం చేయడంలేదు. దీంతో నగర వ్యాప్తంగా నిర్మాణదారులు ఇష్టారాజ్యంగా సెల్లార్లు తవ్వుతున్నారు. ఈనేపథ్యంలో విస్తారంగా వర్షాలు కురిస్తే భవనాల కింద నుండి నేల కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుందని ఆయాప్రాంతాల్లోని కాలనీవాసులు వాపోతున్నారు. ఇటీవల తమ ప్రాంతాల్లో అక్రమంగా సెల్లార్ల నిర్మాణం చేపట్టారని పలువురు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశారు. సరూర్‌నగర్ వాసవికాలనీ నివాసి సెల్లార్లలో నీళ్లు నిలిచిపోయి దోమలబెడద ఉంటుందని ఫిర్యాదుచేశారు. అలాగే ఆర్‌కె.పురం డివిజన్లో మరో రెండు సెల్లార్ తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిపారు. అలాగే మాదాపూర్లోని సైబర్ టవర్స్ వెనుక ఓపెన్ సెల్లారు తవ్వినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఫిర్యాదుచేశారు. రాంనగర్ ప్రాంతంలో కూడా ఇష్టారాజ్యంగా సెల్లార్ల తవ్వకాలు చేపట్టారని రాంనగర్‌గుండు ప్రధాన రహదారిలో యథేచ్ఛగా మట్టిని రిటైనింగ్ వాల్ లేకుండానే జెసిబితో ఉపయోగించి సెల్లార్ తవ్వకం జరుగుతోందని ప్రక్కనే ఉన్న భవనానికి ప్రమాదకరంగా మారిందనే విమర్శలు స్థానికుల్లో వ్యక్తం అవుతున్నాయి.

**పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు..**

అనధికారికంగా సెల్లార్ తవ్వాకాలు చేపట్టినా ఆయా సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు తమ పరిధిలోని కొత్త నిర్మాణాల ప్రదేశాలను సందర్శించాల్సి ఉంటుంది.

మంజూరు చేసిన ప్లాన్ ప్రకారం సెల్లార్ సెట్‌బ్యాక్‌లు ఉన్నాయా? లేదా? నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. అలాగే చుట్టుపక్కల నిర్మాణాల భద్రతను తనిఖీ, సెల్లార్‌లో నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మట్టి జారకుండా, రిటైనింగ్ గోడలు, బారికేడింగ్ వంటి అవసరమైన ప్రామాణిక భద్రతాచర్యలు తీసుకోకపోతే నోటీసు జారీచేయాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించకపోతే పనిని ఆపడానికి, బిల్డర్ అనుమతి, లైసెన్సు రద్దుచేయడానికి, బిల్డర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయడానికి వారికి అధికారం ఉంటుంది.

అయినప్పటికీ సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా కేవలం అనుమతులు ఇచ్చి వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను చెల్లించాలి

-పశుసంవర్ధకశాఖలో శాశ్వత ఉద్యోగులుగా నియమించాలి
-మంత్రి వాకాటి శ్రీహరికి రాష్ట్ర గోపాలమిత్రసంఘం వినతి

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:**
గత తొమ్మిదినెలల వేతన బకాయిలు వెంటనే విడుదలచేయాలని తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర సంఘం రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి వాకాటి శ్రీహరి ముదిరాజ్‌ను కోరింది. ఈమేరకు మంగళవారం అసోసియేషన్ అధ్యక్షులు మారబోయిన రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రవీందర్‌ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణరాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా నియమితులైన గోపాలమిత్రులు రైతు ఇంటి ముంగిట పశు కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా ఉండేందుకు కృషి చేయడం జరిగిందన్నారు. గోపాల మిత్రుల విధులు కృత్రిమ గర్భధారణ అయినప్పటికినీ పశుసంవర్ధక శాఖలో క్షేత్రస్థాయి చేపట్టే జీవాలకు నట్టల నివారణ మందుల పంపిణీ, పశుగణన, ప్రథమ చికిత్సలు, రైతులకు పశుగ్రాసాలు పెంపకంపట్ల అవగాహన కల్పించుట, పాడి రైతులను విజయడైరీకి పాలు పోసేవిధంగా చర్యలు చేపట్టడం, పశుగర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరాలు నిర్వహించడం, నాణ్యమైన పశుజాతిని పెంపొందించడం, దూడల మరణాలను తగ్గించుటకు అవగాహన చర్యలు చేపట్టటం, రైతులకు అవగాహన సదస్సులు, పశువుల్లో టీకాల కార్యక్రమం, ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ ద్వారా చేపట్టే అన్ని కార్యక్రమాలు చిట్టచివరి మారు మూల గ్రామాల్లో ఉన్న ప్రతి రైతుకు అందజేయడంలో ముందుండి ఎన్నోసార్లు ప్రభుత్వాల మన్ననలను పొందడం జరిగింది. అరకొర జీతాలు ఉన్నప్పటికినీ అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ సేవలను అందిస్తున్నామని తెలియజేయడం జరిగింది. కావున గత 25సంవత్సరముల గోపాలమిత్రల అనుభవాన్ని, వయస్సును దృష్టిలో ఉంచుకొని పశుసంవర్ధకశాఖలో శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని మంత్రిని కోరడం జరిగిందన్నారు. ప్రతినెల జీతాలు విడుదలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని 10లక్షల ఆరోగ్య, ప్రమాదబీమా, ఐదులక్షల రిటైర్మెంట్ ఫండ్ చెల్లించటం మొదలగు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు రవీందర్ ముదిరాజ్ తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రతినిధులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, పలుచ మహేష్‌గౌడ్, సిరవేణి తిరుమల రాజేశం ముదిరాజ్, కొప్పెర నాగయ్య, దశరథ్, వెంకటేష్ గౌడ్, అశోక్‌గౌడ్, గోపాల్ ముదిరాజ్, నిరంజన్ ముదిరాజ్, రవి, మాషప్ప, వెంకట్, సతీష్, రమేష్‌నాయక్ తదితర గోపాలమిత్రులు పాల్గొన్నారు.

# చదువు చారెడు..పుస్తకాలు బోలెడు

-బాల్యంపై బ్యాగుల భారం
-చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
-స్థాయికి మించిన పుస్తకాల మోత
-విద్యార్థుల్లో పెరుగుతున్న అసహనం



**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:**
అమ్మా ...భుజం, వెన్ను నొప్పి వస్తుంది. కాళ్లు గుంజుతున్నాయి. అంటూ పాఠశాలనుంచి ఇంటికి వచ్చిన వికాస్ బ్యాగ్ టేబుల్‌పై పెట్టి విశ్రాంతికి ఉపక్రమించాడు. ఇంటికి రాగానే నీరసం, ఏమీ తినలేడు, తాగలేడు. అసహానానికి గురవుతాడు. ఇది విద్యాసంవత్సరం ఆరంభంలో ప్రతి ఇంట్లో పిల్లలు పలికే అవస్థల పలుకులు. ఎందుకంటే వారి వయస్సుకు మించిన పుస్తకాల బరువు మోస్తున్నారు. కొన్ని ప్రైవేట్‌పాఠశాలల యాజమాన్యాలు ప్రీస్కూల్ (ఎల్‌కెజి, యుకెజి)లోని హోంవర్క్, డ్రాయింగ్ నోట్‌బుక్స్ ఇస్తూ కెజిల కొద్దీ బరువున్న పుస్తకాలను కట్టబెడుతున్నారు. వాటిని రోజూ స్కూళ్లకు మోసుకెళ్లేందుకు పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు. ఎల్‌కెజిలోనే సుమారు 7కెజిల బరువు మోయాల్సి వస్తుందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బుడిబుడి అడుగులు వేస్తూ హాయిగా చదువుకోవాల్సిన పిల్లలను పోటీతత్వం కారణంగా తల్లిదండ్రులు చదువుపేరుతో ఒత్తిడి పెంచుతున్నారు. దీంతో బాధను బయటకు చెప్పుకోలేక చిన్నారులు లోలోన మదనపడుతున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, కంపాక్స్, టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్ ఇలా వయస్సుకు మించిన అధికభారం మోస్తున్నారు. చదువు చారెడు.. పుస్తకాలు బోలెడు.. అన్న చందంగా ఉంది విద్యార్థుల దుస్థితి. బరువు పెరిగేకొద్దీ విద్యార్థుల్లో వెన్నుపూసనొప్పి వస్తుంది. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు భవనాల్లో ఉండటంతో మూడు నాలుగు అంతస్తులు ఎక్కాల్సి వస్తుంది. రోడ్డుపై నడవడం గగనం కాగా, నాలుగు అంతస్తుల భవనం మెట్లెక్కడం ఎంతకష్టమో యాజమాన్యాలు గమనించడం లేదు. పిల్లలు కాన్వెంట్ చదువులతో ఉన్నతస్థితికి చేరాలని ఆరాటపడతారేమో కానీ వారి బరువు భారం గురించి వీసమెత్తైనా తల్లిదండ్రులు ఆలోచించడం లేదు. యశ్‌పాల్ కమిటీ చేసిన సిఫార్సులు కూడా అమలు కావడం లేదు. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో పుస్తకాల బరువుపై చర్చ జరుగుతుంది. విద్యార్థి సంఘాల ఆందోళనలు చేయడం షరా మామూలే. అయితే విద్యాశాఖ అధికారులు చిత్తశుద్ధితో సిఫార్సులు అమలు చేస్తే విద్యార్థులకు పుస్తకాల బరువుతోపాటు వారిలో మానసిక ఆందోళన తగ్గుతుంది.

**తల్లిదండ్రులు ఏం చేయాలి..**

విద్యార్థుల తల్లిదండ్రులు తగిన సూచనలు పాటిస్తే మంచిది. పిల్లలు ఎన్ని పుస్తకాలు తీసుకెళ్ళాలి. బ్యాగ్ బరువు ఎంతవరకు ఉండాలో స్వయంగా చూడాలి. 1నుంచి ఐదోతరగతి విద్యార్థుల బ్యాగ్‌బరువు 2నుంచి 5కెజిల వరకు ఉండేలా చూడాలి. ఐదునుంచి 10తరగతి విద్యార్థుల బ్యాగ్‌బరువు 7కెజిలలోపు ఉండాలి. సాధ్యమైనంతవరకు పుస్తకాల బరువు ఎక్కువగా ఉండకుండా చూడాలి. బ్యాగులు కూడా తక్కువ బరువు ఉన్నవి కొనుగోలు చేయడం వల్ల బరువును తగ్గించవచ్చు.

**నిబంధనలు బేఖాతర్..**

విద్యార్థుల పుస్తకాలబరువు ఎంత ఉండాలి? ఎలాంటి విద్యను అందించాలి? విద్యావిధానం అమలు గురించి ఒకమిటీ చేసిన సిఫార్సులు బుట్టదాఖలు అవుతున్నాయి. ఏ విద్యాసంస్థల యాజమాన్యంకూడా సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న పాపానపోవడంలేదు. విద్యాశాఖ అధికారులు కూడా ఉదాసీనంగా వ్యవహరిస్తూ విద్యార్థులకు శాపంగామారారనే ఆరోపణలున్నాయి. దేశంలోని విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 1992లో యుజిసి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ యశ్‌పాల్ నేతృత్వాన సిఫార్సు కమిటీని నియమించింది. వారు దేశంలోని విద్యావ్యవస్థల్లో అధ్యయనం చేసి కేంద్రానికి పలు సిఫార్సులు చేశారు. వాటిని కేంద్ర అమోదిస్తూ కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. 2005నుంచి విద్యాహక్కు చట్టం కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించింది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులు రెండు నుంచి మూడు కిలోల బరువు, ఐదు నుంచి పదోతరగతి వరకు విద్యార్థులు 5నుంచి 7కిలోలలోపు బరువు ఉండాలని సూచించింది. విద్యార్థులను యంత్రాలుగా చూడరాదని స్పష్టం చేసింది. అయినా ఏ ప్రభుత్వం కూడా ఆచరణలో అమలు చేయడంలేదు. విద్యాశాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

# తప్పుడు బిల్లులతో రూ.53లక్షలు కాజేసేందుకు పన్నాగం?

-సంతోష్‌నగర్ సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్ అధికారుల లీలలు..
-పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్ జంగం శ్వేత..



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

**సైదాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:**
సంతోష్‌నగర్ సర్కిల్ పరిధిలోని ఐఎస్ సదన్ డివిజన్‌లో జిహెచ్‌ఎంసి ఇంజనీరింగ్ అధికారుల అవినీతి లీలలు మరోసారి వెలుగుచూశాయి. పనులు చేపట్టకున్నా తప్పుడు బిల్లులు సృష్టించి రూ.53లక్షల ప్రజాధనాన్ని జేబుల్లో వేసుకునేందుకు పక్కా స్కెచ్ వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐఎస్ సదన్ డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలోని పార్కునుండి డిఎస్ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంవరకు వరద నీటికాలువ (బాక్స్‌డ్రెయిన్) నిర్మాణాన్ని 2021లో రూ.90లక్షల అంచనాతో పనులు ప్రారంభించారు. అయితే ఇప్పటివరకు పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. పదివేల రూపాయల పని కూడా జరుగలేదని స్థానికులు పేర్కొంటున్నారు. నత్తనడక పనుల గురించి స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేశారు.

**పోలీసులకు ఫిర్యాదు చేసిన కార్పొరేటర్..**

బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టకున్నా, పనులు పూర్తయ్యాయని తప్పుడుబిల్లులు సృష్టించి రూ. 53,59,330ల బిల్లుతో జిహెచ్‌ఎంసికి ప్రతిపాదనలు పంపినట్లు కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తుజరిపి సంబంధిత ఇఇ, ఎఇ, కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ కార్పొరేటర్ శ్వేత మంగళవారం ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. ఐఎస్ సదన్ డివిజన్‌లో జరిగిన పనులన్నింటిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కార్పొరేటర్ శ్వేత ఉన్నతాధికారులను కోరారు.

**గతంలోనూ అవినీతి మరకలు..**

ఇదే డివిజన్‌లో సింగరేణి కాలనీ వాంబే క్వార్టర్స్‌లో రోడ్డు నిర్మించకుండానే రూ.9లక్షల బిల్లులు తీసుకున్నారని స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి గత నెల 21న కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణలో రోడ్డు నిర్మించకున్నా ఇఇ, ఎఇ, కాంట్రాక్టర్‌లు కుమ్మక్కయి బోగస్ బిల్లులతో మోసం చేశారని తేలడంతో ఈఈ ఏకాంబరంపై సస్పెన్షన్ వేటువేసి ఎఇ అన్సారిని విధుల నుంచి తొలగించారు.

## రేపే గోల్కొండ బోనాలు

-జగదాంబిక, మహంకాళి అమ్మవార్లకు తొలిబోనం
-రాష్ట్ర ప్రభుత్వంచే పట్టువస్త్రాల సమర్పణ
-నెలరోజులపాటు జరగనున్న ఉత్సవాలు

**మెహదీపట్నం, జూన్ 24, ప్రభాతవార్త:**
గోల్కొండ శ్రీజగదాంబికా మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు రేపటి నుంచి ప్రారంభమవుతున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు ఆద్యంతం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగనున్నాయి. ఆషాఢమాసంలో నిర్వహించే బోనాలవేడుకకు భక్తులు లక్షలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకొని, చల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకుంటారు. ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగే ఈవేడుకల్లో అమ్మవారికి పచ్చికుండతో తొలిబోనంసమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వంచే అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా గోల్కొండకోటలో నెల రోజులపాటు బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని గురు, ఆదివారాలలో 9రోజులపాటు 9పూజలు నిర్వహిస్తారు. ఆషాఢమాసం అమావాస్య మరుసటి గురువారం ప్రారంభమై బోనాలు ఉత్సవాలు జులై 7న ముగియనున్నాయి.

గోల్కొండ కోటలో కొలువైన జగదాంబిక అమ్మవారికి మొదటి బోనాన్ని లంగర్‌హౌస్‌వాసులు పచ్చికుండతో సమర్పిస్తారు. 28కులవృత్తుల ఆధ్వర్యంలో అమ్మవార్లకు రెండు పచ్చికుండల్లో నజర్‌బోనాలను చేసి జగదాంబిక అమ్మవారికి, మహంకాళి అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. భారీ తొట్టెలకు రాష్ట్రమంత్రులు ప్రత్యేకపూజలు నిర్వహించి దేవాదాయశాఖ తరపున పట్టువస్త్రాలుసమర్పిస్తారు. బడాబజార్, రిసాల బజార్‌మీదుగా అమ్మవార్లవద్దకు చేసుకొని భక్తులు బోనాలను, పట్టువస్త్రాలను సమర్పిస్తారు.

## బస్తీ సమస్యలు ఎప్పటికప్పుడే పరిష్కారం

-ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సికింద్రాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:**
బండమైసమ్మనగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లవాసుల సమస్యలు అన్నింటినీ పరిష్కరిస్తామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. మంగళవారం బన్సీలాల్‌పేట డివిజన్‌లోని బండమైసమ్మనగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు సరిపడా నీరు వస్తలేవని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు చెప్పారు. ఆయన వెంటనే స్పందిస్తూ నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రస్తుతం ఉన్న సంప్‌కు అదనంగా మరో సంప్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అప్పటివరకు నీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయాలని చెప్పారు. అదే విధంగా విద్యుత్‌లో ఓల్టేజి సమస్య కూడా ఉందని తెలపగా, సమస్య పరిష్కారానికి ఏవిధమైన చర్యలు చేపట్టాలో గుర్తించాలని, అవసరమైతే అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసే దిశగా పరిశీలించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. లిఫ్ట్‌లు కూడా పని చేయడం లేదని, మహిళలు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులుపడాల్సి వస్తుందని తెలపగా, త్వరలోనే లిఫ్ట్‌లను వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వాసులు బ్లాక్‌ల వారీగా సమావేశమై కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. 10రోజుల్లోగా కమిటీని ఎన్నుకోవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యేవెంట కార్పొరేటర్ హేమలత, డిసి డాకునాయక్, వాటర్‌వర్క్, ఎంటమాలజిస్ట్ అధికారులు, ప్రేమ్‌కుమార్, అబ్బాస్, అరుణ్‌గౌడ్, కుమార్‌యాదవ్, రజాక్, అచ్చయ్య తదితరులు ఉన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాలు

**బేగంపేట జూన్ 24, ప్రభాతవార్త:** చారిత్రాత్మకమైన శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి బోనాలను రాజకీయాలకు అతీతంగా అంగరంగ వైభవంగా నిర్వహిద్దామని,శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆషాఢ జాతర 2025 బోనాల జాతర ఉత్సవాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ శాఖల అధికారులతో ఆలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్,జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, కార్పోరేటర్ చీరు సుచిత్రా శ్రీకాంత్,మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధరర్‌రెడ్డి,సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ, శైలజారామయ్యర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆషాఢ బోనాలు 2025ను వైభవంగా నిర్వహిస్తామ న్నారు. ఈ నెల 26న గోల్కొండ తొలిబోనంతో ప్రారంభమై, ఒకటిన బల్కంపేట ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణం,13న ఉజ్జయినీ మహాకాళీ బోనం,14న రంగం (భవిష్యవాణి) ,20లాల్ దర్వాజ బోనాలతో నెలరోజుల పాటు హైదరాబాద్‌లో జరిగే ఆషాఢ బోనాలను అంగ రంగ వైభవంగా నిర్వహించను న్నట్లు ఆయన తెలియజేసారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తరుపున అన్ని రకాలైన ఏర్పాట్లు చేస్తున్నామని,దేవాదాయ ధర్మాదాయ శాఖ,రెవెన్యూ,పోలీసు విద్యుత్,జలమండలి,అన్ని శాఖల సహకారంతో బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వ హిస్తామన్నారు. హైదరాబాద్ నగరానికి దేశ,విదేశాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను హైదరాబాద్ ప్రజలు ఎంతో ఆప్యాయంగా ఆత్మీయంగా చూసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు.ప్రభుత్వం తరుపున ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కావని,అందుకే ప్రజలు సహకరించి అమ్మ వారి జాతరను ఎంతో వైభవంగా జరుపుకోవాలన్నారు.దేవాలయ ఏర్పాట్లలో భాగస్వామ్యం అవుతున్న అందరికీ పొన్నం అభినందనలు తెలియజేసారు.


శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ ఏడాది ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆలయం లోపల కేబుల్ వైర్లు కొత్తవి వేసి ఇబ్బందులు ప్రమాదాలు జరగకుండా చూడాలని మహంకాళీ ఈ ఒ కు మంత్రి పొన్నం సూచించారు.బారి కేడింగ్‌తో పాటు జాలి ఏర్పాటు చేయాలన్నారు.ఆతిధ్యం ఇవ్వడంలో హైదరాబాద్ నగర ప్రజలు ఎవరికీ తీసిపోరన్నారు.దేశ విదేశాల నుంచి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఆతిధ్యం ఇవ్వాలని నగరవాసులను కోరారు.ఏఏ పండుగలు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్నాయో అధికారులు ఆయా ప్రాంతాల్లో ముందస్తుగా గుర్తించి తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు.అవసరమైతే రెండు సార్లు తాగునీటి సరఫరా చేయాలన్నారు.హైదరాబాద్ మొత్తం ఒకే సారి అయితే కొంత ఇబ్బంది ఉంటుందని, కానీ ఒక్కో వారం ఒక్కో ఆలయం లో బోనాలు ఉంటాయి కాబట్టీ భద్రత విషయం లో పోలీసులు పటిష్టమైన జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. అమ్మ వారి ఆశీర్వాదం ఉండాల న్నారు. ప్రభుత్వ పరంగా అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. 3600దేవాలయాలకు సంబంధించి సమీక్ష రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశం జరిగింద న్నారు. గోల్కొండ, శ్రీఉజ్జయినీ మహాకాళీ, బల్కంపేట, లాల్ దర్వాజ ఇలా ఒక్కో వారం ఒక్కో ఆలయంలో ఉత్సవాలు జరగనున్నాయ న్నారు. జోగినులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసా మన్నారు.మాకు బోనం ఎత్తుకునే వారే ప్రథమ ప్రాధాన్యత అని,బోనాల సమయంలో కాకుండా రద్దీ తక్కువ ఉన్న సమయంలో వీఐపీలు వస్తే ఇబ్బందులు ఉండవని మంత్రి పేర్కొన్నారు.ఉజ్జయినీ మహాకాళీ బోనాలు చరిత్రలో నిల్చిపోయే విధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.దక్కన్ మాన సేవా సమితీ,ఇతర సంస్థలు అమ్మ వారి ఆలయం వద్ద చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు.అందరూ వారి సహకారం అందించి ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని,పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ బోనాల జాతరను విజయ వంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# తక్కువ ధరకే బంగారం పేరిట మోసం: నిందితుల అరెస్ట్

**సికింద్రాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మోండ పోలీస్‌స్టేషన్ పరిధిలో తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామంటూ హరిరామ్ అనే వ్యాపారికి రాధేశ్యామ్ మద్యవర్తి డీల్ కుదిర్చాడు. అయితే రూ. డెబై లక్షల రుపాయలు హరిరామ్ సిద్ధం చెసుకోని తన కార్యలయం ఉంచుకోగా, అతని వద్ద డబ్బు కాజేయలని రాధేశ్యామ్ వెసిన ప్లాన్‌కు వర్మ అనే గ్యాంగ్ స్కెచ్ వెసింది. పదెన్నిమిది మందితో పకడ్బందిగా స్కెచ్ వెసి డబ్బును ఎలా కాజేయలో ఆలోచన చెయగా కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేశవులను రంగంలోకి దింపి ఎస్‌ఓటి పోలీస్‌లమంటూ హరిరామ్ కార్యలయంలో తనిఖీ చెశారు. అక్కడ ఉన్నడబ్బును తీసుకోని కారులో వెళ్ళిపోగా.మరో ఇద్దరు వారి వెంట బైక్ పై కారును అనుసరిస్తూ వెళ్లారు. అయితే అంతకు మందు పక్క ప్రాణలికగా ఒక బెకరిలో కూర్చుని మాట్లాడుకున్న వీరంత. బైక్ పై ఇద్దరు. కారులో నలుగురు వెళ్ళి డబ్బు తీసుకోని వచ్చాక డబ్బుతో పారిపోదం అని నిర్చయించుకోగా కిందకు వచ్చిన తరువాత డబ్బును బ్యాగు ను తీసుకోని బైక్ పై కంగరులో ఒకరు జూబ్లిబస్ స్టేషన్ మార్గంలో వెళ్ళిపోగా మరోక టీం కారులో ఎల్ బి నగర్ మార్గంలో వెళ్ళిపోయింది. అయితే వ్యాపరి ఇచ్చిన ఫిర్యాదుతో కారు నెంబరు ఆధారంగా కారును గుర్తించి పోలీసులు పట్టుకోగా వారి వద్ద డబ్బు లేదని తేలగా ఇక బైక్ పై వెళ్ళిన రాంబబుతో పాటు మరో వ్యక్తి


వివరాలను వెల్లడిస్తున్న డిసిపి

చెప్పిన సమాధనంతో అంత అవాక్కయ్యారు. రాంబాబు తో పాటుమరో వ్యక్తి బైక్ పై వెళుతున్న సమయంలో ఒక బ్యాచ్ వారిని అడ్డగించింది. అయితే వారు బైక్ ఫైనన్స్ రికవరీ ఎజెంట్లు కాగా బైక్ ఫైనాన్స్ కట్టలేదని బైక్ ను సీజ్ చెస్తున్నట్లు చెప్పారు. వారు కాస్తా కంగారు పడడంతో వారి బ్యాగు వాలకం చూసి అనుమానం కలిగిని రోషన్ వారిని తీసుకోని తిరుమలగిరి వరకు వెళ్ళాడు. అక్కడ తన సన్ని హిత మిగత రికవరీ టీంతో కలసి బ్యాగు తనిఖీ చేయగా లక్షల కోద్ది రుపాయలు ఉండడంతో వారిని పక్కకు తప్పించి బ్యాగుతో రికవరీ ఎజెంట్లంత ఉడయించారు. జవహర్ నగర్ వారి సోంత ప్రాంతనికి వెళ్ళిన తరువాత వారంత ఆ డబ్బును పంచేసుకోని కట్టవలసిన అప్పులు కట్టేసి, ఇంట్లో వారికి బంగారం కోనుగోలు చెసి ఇక పబ్ లలో డబ్బులు చల్లుతు ఎంజాయ్ చెయగా కీ రోల్‌గా వ్యవహరించిన రోషన్ గోవ వెళ్ళి ఎంజాయ్ చేశాడు. బైక్ రికవరీ ఎజెంట్లు బ్యాగుతో ఉడయించరాని అసలు దోంగలు పోలీసులకు వివరించడంతో ఇక నకిలీ పోలీస్ బ్యాచ్, స్కెచ్ వెసి బ్యాచ్ వారి నుంచి డబ్బు దోంగలించిన బ్యాచ్ మొత్తంగా పదహారు సభ్యులను ఆరెస్ట్ చెసి వారి వద్ద నుంచి 43 లక్షలు,59 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు.

# ఇరాన్‌పై అమెరికా దాడులకు వామపక్షాల నిరసన

**సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో తనకు ఉన్న ఆర్థిక బలాన్ని అసరాగా చేసుకుని ప్రపంచదేశాలను మూడవ ప్రపంచ యుద్ధం వైపు నెట్టి వేస్తుందని వామపక్ష పార్టీల నాయకులు ఆరోపించారు. ఇంత కాలం పరోక్షపాత్ర పోషిస్తూ వివిధ దేశాల మధ్య యుద్ధాలను సృష్టించిన అమెరికా ఇప్పుడు ప్రత్యక్షంగా ఇరాన్‌పై దాడికి తెగబడటం గర్హనీయమని నాయకులు చెప్పారు. ఇరాన్‌పై అమెరికా దాడులను నిరసిస్తూ రాష్ట్ర వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నారాయణగూడలోని వైఎంసిఎ వద్ద ఆనేక మంది నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచాన్ని 3వ యుద్ధంవైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే రష్యా ఉక్రేయిన్ మధ్య యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్స హించిన ట్రంప్ ఇటీవల వరకు పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిచేసేలా చేయగా తాజాగా ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధానికి పుర్పిగోల్పడంమే కాకుండా అణాయుధాల పేరుతో అమెరికా ఇరాన్ శక్తివంతమైన బాంబుల వర్షం కురిపించడం దుర్మార్గమన్నారు. మన ప్రధాని నరేంద్రమోదీ ప్రాణ స్నేహితుడైన ట్రంప్ ప్రపంచాని న్ని మూడవ యుద్ధంవైపు తీసుకువెళుతన్నా కూడా ఆయన నోరుమెదపలేదని విమర్శించారు. అమెరికా యుద్ధకాంక్షకు వ్యతిరేకంగా తక్షణమే మోదీ తన గళాన్ని వినిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లి మాట్లాడుతూ అమెరికా ప్రపంచ దేశాలపైఆధిపత్యాన్ని చెలాయించేందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా వివిధ దేశాల మధ్య యుద్ధానికి అజ్యం పోయడాన్ని వామ పక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐరాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి, డిజి నరసింహా రావు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని వెంకటేశ్వరావు, గోవర్థన్ తదితరులు పాల్గొన్నారు.


వైఎంసిఎ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

## సమస్యల పరిష్కారానికి కృషి

**కంటోన్మెంట్,జూన్ 24 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 1వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను సిఈఓ మధుకర్ నాయక్ దృష్టికితెచ్చి సమస్యలుపరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. మంగళవారం ఆయన లక్ష్మి నర్సింహ్మ కాలనీలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

## ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తా: ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,జూన్ 24 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం 8వ వార్డు బొల్లారంలోని హోలీ ట్రినీటి చర్చి నుంచి ఆర్మీ కంపౌండ్ వరకు 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణు గోపాల్ రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయ ప్రకాశ్, నాయకులు బాల్‌రాజ్, ఖదీర్ వన్, నరహరి, ప్రేమ్, కిరణ్, ముఖేశ్ పాల్గొన్నారు.

## ఒలింపిక్ రన్‌ను ప్రారంభించిన సిఈఓ మధుకర్ నాయక్

**కంటోన్మెంట్,జూన్ 24 ప్రభాతవార్త:** గత 30 సంవత్సరాల నుంచి కంటోన్మెంట్ నుంచి ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నామని రన్ క్రీడాకారులకు స్పూర్తినికలిగిస్తుందని కంటోన్మెంట్‌బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఛీఫ్ ప్యాట్రన్‌జంపన ప్రతాప్‌తెలిపారు. సికింద్రాబాద్ జింఖానా మైదానం నుంచి ఎల్బీస్టేడియం వరకు నిర్వహించిన ఒలింపిక్ జ్యోతిని వెలిగించి రన్ ప్రారంభించారు.స్పోర్ట్స్ అధికారి సుధాకర్, మాస్టర్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ ప్రతినిధులు మర్రి లక్ష్మారెడ్డి, ప్రభుకుమార్‌గౌడ్, సత్యనారాయణ, జయరాజ్, జగదీశ్, సాయిబాబా యాదవ్‌లు పాల్గొన్నారు.

## యథార్థ సంఘటనల ప్రతిరూపం 27వ మైలురాయి నాటకం

**రవీంద్రభారతి, జూన్ 24 ప్రభాతవార్త:** నిజం గెలుస్తుందన్న మాట నిజమేనైనా గెలిచేదంతా నిజం కాదనే ప్రధానాంశంగా వ్రాయబడిన 27వ మైలురాయి నాటకం 1993లో జరిగిన యదార్థ సంఘటనల ప్రతిరూపమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి తెలిపారు. న్యాయవాదులు తమ దగ్గరకు వచ్చిన అడ్డమైన కేసులు, సమాజానికి కీడుచేసే కేసులను వాదించకుండా ఉండడమే ఉత్తమం అనే అంశంపై వ్రాయబడ్డ నాటకం ఈ 27వ మైలురాయి అని వివరించారు. ప్రతీనెలా నాటకం.. ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం.. అదే మాబాట మాటనే ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో గురువారం రాత్రి 6.45గంటల నుండి పి.టి.మాధవ్ రచన; రౌతు వాసు దేవరావు దర్శకత్వంలో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ విజయవాడ వారి సమర్పణలో ఈ 27వ మైలురాయి సందేశాత్మక నాటకం ప్రదర్శింపబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాన పాత్రల్లో నటరాజ్, సురభి ప్రభావతి, జాహ్నవి, పవన్‌కుమార్, వాసు, కిరణ్, వరప్రసాద్, మోహిత్ తదితరులు ఆయా పాత్రల్లో నటిస్తున్న ఈ నాటక ప్రదర్శనకు అధికసంఖ్యలో నాటకప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి ఆస్వాదించి విజయవంతం చేయాలని డా. కె.వి.రమణాచారి కోరారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి

# రోడ్డు ఆక్రమణలపై హైడ్రా కొరడా

**దుండిగల్, నిజాంపేట, జూన్ 24 ప్రభాతవార్త:** గేటెడ్ కమ్యూనిటీల పేరుతో రోడ్లకు అడ్డంగా నిర్మించిన ప్రహారీలను హైడ్రా అధికారులు నేలమట్టం చేశారు. కూల్చివేతలతో కాలనీ వాసులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. హైడ్రా బృందంతో పాటు దుండిగల్ పోలీసులు ఆందోళనకారులను కట్టడి చేయడంతో కూల్చివేతలు పూర్తి చేసి రోడ్లపై రాకపోకలు కొనసాగేలా చేశారు. బాచుపల్లి పరిధిలోని ప్రణీత్ అంటిలియా, మల్లంపేట పరిధిలోని హైరైజ్ విల్లాస్ పేరుతో కొంతకాలం క్రితం ఇండిపెండెంట్ ఇండ్ల నిర్మాణం చేసి విక్రయించారు. గేటెడ్ కమ్యూనిటీలు కాకపోవడంతో స్థానికులు కాలనీలలో రహదారుల గుండా రాకపోకలు కొనసాగించేవారు. కొంతకాలం తరువాత ఆయా కాలనీవాసులు చుట్టూ ప్రహారీలు నిర్మించి రాకపోకలను అడ్డుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రహదారులను అడ్డగిస్తూ నిర్మాణం చేయడంపై స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన ఫలితం లేకపోవడంతో హైడ్రాను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కొద్దిరోజుల కిందట సందర్శించిన హైడ్రా అధికారులు ఆయా కాలనీలకు సంబంధించిన లేఅవుట్‌లను పరిశీలించి గేటెడ్ కమ్యూనిటీలు కావని నిర్ధారణకువచ్చారు. మంగళవారం సదరు కాలనీలకు చేరుకున్న హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టి రోడ్డు ఆక్రమణలను తొలగించారు. అదేవిధంగా మల్లంపేట కెవిఆర్‌వ్యాలీరోడ్డుకుఅడ్డంగా ఏర్పాటుచేసిన గేటు తొలగించారు.


హైరైజ్ విల్లాలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

**కాలనీవాసుల ఆగ్రహం..**
**స్థానికుల హర్షం...**

హైడ్రా అధికారులు రోడ్ల ఆక్రమణలను తొలగించేందుకు ఆయా కాలనీల వద్దకు చేరుకోగానే కాలనీవాసులు ఆందోళన దిగారు. మేము గేటెడ్ కమ్యూనిటీ అని కొనుగోలు చేశామని, ఇప్పుడు రహదారుల వద్ద ప్రహరీని తొలగిస్తే మా భద్రత పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తూ ఆగ్రహించారు. వారికి అధికారులు నిబంధనల మేరకు చేస్తున్నాము అని నచ్చుజెప్పే ప్రయత్నం చేసిన ఆందోళన చేపట్టడంతో పోలీసులు వారిని కట్టడి చేయడంతో హైడ్రా కూల్చివేతలు పూర్తి చేశారు. కాగా రహదారులను అడ్డుగా నిర్మించిన నిర్మాణాలను హైడ్రా తొలగించడ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీలు ఏర్పడిన కొంతకాలం వరకు ఆయా కాలనీల నుండి రాకపోకలు సజావుగా జరిగేవని, తరువాత రోడ్లకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడినట్లు పేర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు మా సమ్యను పట్టించుకోలేదని, హైడ్రా అధికారులు వెంటనేస్పందించి సమస్యను పరిష్కరించారని సంతోషం వ్యక్తం చేశారు. హైడ్రా చర్యలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# బోనాల ఉత్సవాలకు మరింతగా పెరిగిన విశిష్టత

**బేగంపేట జూన్ 24.ప్రభాతవార్త:** రాష్ట్ర పండుగగా ప్రకటించిన తరువాతనే బోనాల ఉత్సవాల విశిష్టత మరింత పెరిగిందని,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో నిర్వహించిన బోనాల జాతర 2025 సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కల్సి ఎమ్మెల్యే తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తెలంగాణా సంస్కృతిని చాటిచెప్పే బోనాల ఉత్సవాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేసారు.నాటి నుంచి బోనాల ఉత్సవాలకు విశేష ప్రాచుర్యం లభించిందన్నారు. ఈ బోనాల ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా గోల్కొండ, సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ, పాత బస్తీ ప్రాంతాల్లో ఎంతో సందడి ఉంటుందన్నారు.


బోనాల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

మహంకాళీ అమ్మ వారి జాతర 14న రంగం, అంబారీ ఊరేగింపు కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.

# క్రీడా పాఠ్యాంశంగా ఈతను చేర్చాలి: కోలా రవీందర్ ముదిరాజ్

**జీడిమెట్ల, జూన్ 24, ప్రభాతవార్త:** ఈత ఒక సాధన పాఠ్యంలో చేర్చాలని ఈత సాధన తెలియక ప్రతి ఏటా ఉమ్మడి రాష్ట్రంలో 1000 నుంచి 1500 మంది విద్యార్థులు చనిపోతున్నారని ఈత పాఠ్యాంశంలో చేరుస్తూ ఈత వచ్చిన వారికి రెండు మార్కులు వచ్చే విధంగా ఇంట్లో ఉన్న ఇంకుడు గుంత ఉన్న రెండు మార్కులు వచ్చే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోలా రవీందర్ ముదిరాజ్ కోరారు. మంగళవారం జ్యోతిరావు పూలే భవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడుపు కథ రూపంలో 30 మంది జిల్లా కలెక్టర్‌కు గత ముఖ్యమంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు విజ్ఞప్తి ఇవ్వడం జరిగిందన్నారు. అయినా ఇంతవరకు అధికారులు స్పందించకపోవడం చాలా బాధాకరమని, విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఎలా చెప్పాలంటే ఈత వచ్చినవారు నోటితో నీళ్ళు చిమ్ముతాడు కాళ్లు చేతులు నీళ్లపై కొడతారు ఈదుకుంటూ పైకొస్తారని చెప్పాలని, అలాగే ఈత రానివారు నీళ్లు తాగుతారు భయంతో చేతులు పైకి కాళ్లు కిందికి పెట్టి చనిపోతారు అని పిల్లలకు ఉపాధ్యాయుడు చెప్పాలన్నారు. ఎవరైనా వెళ్లి నీళల్లో మునిగిపోతూ ఉంటే లాగడానికి ప్రయత్నం చేయడానికి ముఖ్యంగా అక్కడ గట్టు పైనున్న వారు ఒక ధోతి గాని చున్ని గాని తాడు కానీ అందించే ప్రయత్నం చేయాలన్నారు. లేదా జుట్టు పట్టి లాగాలన్నారు. ఈతరాని వారు దిగితే లాగడానికి ప్రయత్నం చేస్తే మిమ్మల్ని కూడా పట్టుకొని మునిగిపోయే ప్రమాదం ఉంటుందని విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈ విషయమై 20 సంవత్సరాల పోరాటం మొదలు ఇప్పటివరకు కూడా ఎన్నో వినతిపత్రలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయమై ఇరు రాష్ట్రాల విద్యాశాఖ మంత్రులు, ముఖ్యమంత్రులు, పాఠ్యాంశాలు చేర్చే విధంగా ఉత్తర్వులు ఇస్తారని ముకుళిత హస్తములతో విజ్ఞప్తి చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న రవీందర్ ముదిరాజ్

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**నిజాంపేట్, జూన్ 24, ప్రభాతవార్త:** 11కేవీ వికాస్ ఫీడర్‌లో నేడు ఉదయం 9గంటల నుండి 12 గంటల వరకు వికాస్, సాయి కృష్ణజా హిల్స్, టెక్నోపోలిస్, మా విల్లాలు అలాగే 11sకేవీ వోల్వో ఫీడర్‌లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రేణుక యెల్లామ కాలనీ, బాచుపల్లి ఎస్‌సి కాలనీ, కౌసల్య కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని బాచుపల్లి ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

**మయూరి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

11కేవీ కెటిఆర్ కాలనీ ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు కెటిఆర్ కాలనీ, కెఎన్‌ఆర్ కాలనీ, బాలాజీనగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని నిజాంపేట్ ఏఈ తెలిపారు.

# సీసీ రోడ్డు పనులు తనిఖీ

**మెహదీపట్నం, జూన్ 24, ప్రభాత వార్త:** చారిత్రాత్మక గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి బోనాల ఉత్సవాలు రేపటినుండి ప్రారంభమవుతుండడంతో బోనాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. గోల్కొండ ఏరియాలో ఎక్కడ ఎలాంటి చిన్న సమస్యలున్నా వివిధ శాఖల అధికారులతో గోల్కొండ బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కొండెపూడి చంటి బాబు సమన్వయం చేస్తూ అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. పనులలో భాగంగా లంగర్ హౌస్ ప్రధాన రహదారుల వెంట సిసి రోడ్డు పనులు జరుగుతుండడంతో మంగళవారం కార్వాన్ 13 సర్కిల్ డిప్యూటీ కమిషనర్, శశిరేఖ జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పనులను పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులను వేగవంతంగా చేస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు. బోనాల ప్రారంభం నాటికి పనులన్నీ పూర్తి కావాలన్నారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకుల చంద్రశేఖర్, బిజ్జ దుర్గాప్రసాద్, గౌని సంతోష్ గౌడ్, దూసరి వివేక్ గౌడ్ జిహెచ్ఎంసి సిబ్బంది ఉన్నారు.


సిసి రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న డిసి

# తెలంగాణ యువకుడికి 'మిస్టర్ ఇండియా' టైటిల్



**సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన మహబూబ్‌నగర్ జిల్లా నవపేట మండలం ధర్పల్లి గ్రామానికి చెందిన యువకుడు రాకేష్ ఆర్నె 'మిస్టర్ ఇండియా-2025' టైటిల్‌ను సాధించి,రాష్ట్రాన్ని గర్వపడేలా చేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల గోవాలో జరిగిన మిస్టర్ ఇండియా పోటీలలో తనతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చి యువత పోటీ పడిందని, అయితే తాను పడ్డ కష్టానికి ఫలితంగా మిస్టర్ ఇండియా టైటిల్‌ను సొంతం చేసుకున్నానని చెప్పారు. ఈ విజయానికి మూలకారణం నా నిరంతర కృషి, శ్రమ, కుటుంబం, మి త్రుల మద్దతు, నా ఫిట్‌నెస్, ఆత్మవిశ్వాసమేనని తెలిపారు. నాలక్ష్యం త్వరలో జరగనున్న 'మిస్టర్ ఎలైట్ గ్లోబల్' పోటీలో భారతదేశంల తరపున ప్రాతనిధ్యం వహించి, టైటిల్ సాధించడమేనన్నారు. తెలంగాణ నుంచి ప్రపంచవేదికపైన భారత జెండాను అవిష్కరించడమే తన అశయమని రాకేష్ తెలిపారు, ఈ మేరకు పోటీలలో పాల్గొనేందకు ఎంపికైనట్లు చెప్పారు.

# జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు రిజర్వేషన్లు పెంచాలి

**సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పెరిగిన ఎస్సీ జనాభకు అనుగుణంగా రిజర్వేషన్‌ల శాతాన్ని 15 నుంచి 20కి పెంచాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. అతి తక్కువ జనాభా ఉన్న అగ్రవర్ణాలకు 10శాతం రిజర్వేషన్‌లు కల్పించిన కేంద్ర ప్రభుత్వం జనాభా ఎక్కువగా ఉన్న ఎస్సీలకు రిజర్వేషన్ శాతాన్ని ఎందుకు పెంచదని ఆయన ప్రశ్నించారు. ఈమేరకు మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద కొంపల్లికి చెందిన సినీయర్ నాయకురాలు కోరుట్ల లలితను మాల మహానాడు మహిళా విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆయన నియామకపత్రాన్ని అందించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణనలో కులగణన చేపట్టి ఎస్సీల జనాభా ప్రకారం రిజర్వేషన్‌ల శాతాన్ని పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సరళ, నాయకులు రాజేష్‌కాంబ్లే, శాంతయ్య, రమేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


లలితకు నియామకపత్రాన్ని అందిస్తున్న జి.చెన్నయ్య

# హైకోర్టు తీర్పు ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలి

**సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** హైకోర్టు తీర్పు ప్రకారం హిందీ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించి అదుకోవాలని బాధితులు సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. టిఆర్టి 2017 అక్టోబరు 21న నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం హిందీ అసిస్టెంట్లు ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని, హిందీ ప్రచార సభ ప్రదానం చేసే గ్రాడ్యుయేట్‌తో సమానం కాని విద్యావన్, బిఎడ్‌తో సమానం కాని శిక్షక్ ప్రశిక్షిన్ (టీచర్ ట్రైనీంగ్) లాంటి అర్హతలను తొలగించిందని బాధితులు నసీమ్ బేగం, ఖాదర్‌భాషా, ఎండి హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. 1:3 సర్టిఫికేషన్ వెరిఫికేషన్‌లో బిఎడ్‌తో సమానం కాని శిక్షక్ ప్రశిక్షిన్. గ్రాడ్యుయేట్‌తో సమానం కాని విద్వాన్ సర్టిఫికేట్‌తో పోస్ట్ గ్రాడ్యుయేట్ హిందీ అభ్యర్థులను సెలక్ట్ చేయడం వల్ల నోటి ఫికేషన్ ప్రకారం అన్ని అర్హతలు ఉండి మేరిట్ ప్రకారం ఉద్యోగాలు దక్కకపోవడంతో హైకోర్టును అశ్రయించామన్నారు. 2024లో ఫిబ్రవరి 24న హైకోర్టు తమ ముగ్గురికి ఉద్యోగాలు ఇవ్వాలని తీర్పు ఇచ్చిందని, తీర్పు వచ్చి 16 నెలలు గడిచినా టిజిపిఎస్సీ అధికారులు చుట్టు తిరిగినా మెరిట్‌లో లేరనే సాకులు చెపుతున్నారని ఆరోపించారు. అధికారుల తప్పిదాలవల్లనే మేరిట్‌లో లేక తామ హైకోర్టును అశ్రయించామని, హైకోర్టు తీర్పును కూడా అధికారులు లెక్కచేయడం లేదని చెప్పారు. ఈ విషయంలో సిఎం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నిరుద్యోగ యువతకు ఉచితంగా డేటా ఇంజినీంగ్ కోర్సు

**సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** నిరుద్యోగ యువతకోసం శ్రీసత్యసాయి స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత డెటా ఇంజనీరింగ్ కోర్సును అందిస్తున్నామని శ్రీసత్యసాయి సేవా సంస్థ ప్రకటించింది. ఈ కోర్సులకు 2022-25 సంవత్సరాల మధ్య బిఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీ పూర్తి చేసిన పట్ట భద్రులు అర్హులని మంగళవారం నాడిక్కడ ఏర్పాలు చేసిన విలేకరుల సమావేశంలో సేవా సంస్థ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గంటి సోమశేఖర్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు బెసిక్, అడ్వాన్స్‌డ్‌పైథాన్, ఎస్‌క్యూఎల్, తరగతులు హైదరాబాద్‌లోని శ్రీసత్యసాయి స్కిల్ సెంటర్‌లో అన్‌లైన్‌లో జరుగుతాయని, కోర్సు పూర్తి అయిన తరువాత ప్లెస్‌మెంట్ సహాయం కూడా అందిస్తామని, అసక్తిగలవారు పూర్తి వివరాలకు ఈసెల్ నెంబరు 9052372023లో సంప్రదించాలని ఆయన కోరారు.

## అందరూ పరిశుభ్రతను పాటించండి

**: కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్**




**మల్కాజిగిరి జూన్ 24, ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ అన్నారువర్షాకాలం ముందస్తు చర్యల్లో భాగంగా మల్కాజ్గిరి శానిటేషన్ ఆధ్వర్యంలో గౌతమ్ నగర్ లో మల్లికార్జున నగర్ నుండి ఈస్ట్ ఐఎన్ నగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో సంభవించే వ్యాధులను తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ శుభ్రత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఇంటి ముందుకు వచ్చే చెత్త రిక్షాలలో చెత్త వ్యర్థాలను వేయాలని రోడ్లపై మరియు ఉపరణాలలో పెద్దలను వేయవద్దని అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తవేధాలు వేస్తే జరిమానా తప్పదని శానిటేషన్ సూపర్వైజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, స్థానిక నాయకులు మహిళా సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటిన కార్పొరేటర్



**నేరెడ్ మెట్, జూన్ 24,ప్రభాతవార్త :** ఏక్ పెడ్ మా కే నామ్ పే"ప్రచారం లో భాగంగా,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయవంతమైన 11 ఏళ్ల పాలనను పురస్కరించుకుని, నేరేడ్‌మెట్ డివిజన్‌లోని మాతృపురి కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, పార్టీ నాయకులు, ఆసుపత్రి సిబ్బందితో కలిసి మొక్కలు నాటినట్లు కార్పొరేటర్ మీనా ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు.అనంతరం కార్పొరేటర్ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ మధ్య ప్రారంభించిన డెంటల్ క్లినిక్ ని సందర్శించి, అందులో జరుగుతున్న వైద్య సేవపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్, హెడ్ నర్సు తెరెసా రెడ్డి, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, గీతామూర్తి, సత్యనారాయణ, సుధాకర్, శర్మ, పరాస్ జైన్, రాజిరెడ్డి, శ్యామ్, ఆకారం సాయి, హరీష్, రఘురాంరెడ్డి, దినేష్, నాగరాజు, ఉమ్మహేశ్వర్, సుబ్రమణ్యం, జై కుమార్, ధనలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్‌కేపురం చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ



**నేరెడ్ మెట్, జూన్ 24,ప్రభాతవార్త :** రామకృష్ణాపురం చెరువు సుందరీకరణ వేగవంతం చేసి పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో కి తీసుకొస్తానని నేరెడ్ మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారంనేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్‌కేపురం చెరువులో జరుగుతున్న ఫుట్‌పాత్, సుందరీకరణ పనులను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించినారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, "త్వరలో ఈ వాక్ వే పూర్తయ్యి, నేరేడ్‌మెట్ ప్రజల కోసం ఒక అద్భుతమైన, ఆరోగ్యకరమైన వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రానుంది" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదిత్య, గీతామూర్తి, సత్యనారాయణ, సుధాకర్, శర్మ, పరాస్ జైన్, రాజిరెడ్డి, శ్యామ్, ఆకారం సాయి, హరీష్, రఘురాంరెడ్డి, దినేష్, నాగరాజు, ఉమ్మహేశ్వర్, సుబ్రమణ్యం, జై కుమార్, ధనలక్ష్మి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

**: కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి**



దేవాలయం నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్ పేట ,జూన్ 24, ప్రభాతవార్త:** ముసారంబాగ్ డివిజన్ వాంబే కాలనీలోని దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని వాంబే కాలనీ లో రూ .13 లక్షల జిహెచ్ఎంసి నిధులతో చేపట్టిన ఆలయ స్లాబ్ నిర్మాణ పనులను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గతంలో ప్రారంభించిన పనులు వివిధ కారణాల దృష్ట్యా పూర్తి కాలేదని, బస్తి వాసుల సమన్వయ లోపంతో పనులు పూర్తి కాలేదని, ఈ సారి పనులు పూర్తి అయేలా చర్యలు చేపట్టామని వివరించారు. కొద్ది రోజుల క్రితం బస్తి నాయకుడు రామచందర్ తమ వద్దకు వచ్చి స్లాబ్ పనులు పూర్తి చేయించాలని కోరడం జరిగిందని, దీంతో వారికి ఇచ్చిన హామీ ప్రకారం నిధులు మంజూరు చేయించి ఈరోజు పనులు ప్రారంభించడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు.స్లాబ్ నిర్మాణ పనులు బోనాల పండుగ లోపు పూర్తి చేయించాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని జిహెచ్ఎంసి అధికారులకు ఆమె ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎఇ శరత్ ,వర్క్ ఇన్స్పెక్టర్ సత్తి రెడ్డి, నాయకులు రామచందర్ ,దేవేందర్,సురేందర్,కొప్పుల దినేష్,కొంగర ప్రవీణ్, ప్రభాకర్,రమేష్,నవీన్ పాల్గొన్నారు.

## సిపిఐ మహాసభల విజయవంతానికి విస్తృత ప్రచారం నిర్వహించాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్




**నేరెడ్ మెట్, జూన్ 24,ప్రభాతవార్త :** సిపిఐ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు కార్య కర్తలకు సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం పార్టీ కార్యాల యంలో ఆయన మాట్లాడుతూఆగస్టు 19 నుండి 22వ తేదీ వరకు జరుగు సిపిఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలనీ కోరుతూ వినాయక్ నగర్ లోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొని కార్యకర్తల కు దిశా నిర్దేశం చేయడం జరిగిందన్నారు.భారతదేశంలో వంద సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వ హిస్తూ దేశంలో మతసామరస్యం కోసం లౌకిక రాజ్యం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీగా ఉన్న సిపిఐ పార్టీ అని అన్నారు.తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు మన జిల్లాలో జరగడం ఆనందించదగ్గ విషయం అన్నారు. 2025 ఆగస్టు 19 నుండి 22వ తేదీ వరకు నాలుగు రోజు ల పాటు మన జిల్లా కేంద్రంలో కుత్బుల్లాపూర్ మండలంలో జరగనున్నాయని మహాసభల విజయవంతానికి పార్టీ ప్రతిష్టకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహాసభల కరపత్రా లను ఇంటింటికి పంచి మహాసభలకు అధిక సంఖ్యలో జన సమీకరణ చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో 1000 మంది కి పైగా ప్రతినిధులు వాలంటర్లు ఆహ్వానితులు ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొంటారని,రాష్ట్ర మహాసభల నిర్వహణకు జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు తమ సహాయ సహకారాలు అందిం చాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్,మండల కార్యదర్శి టి యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి ఏ అశోక్, సీనియర్ నాయకులు కే ప్రభాకర్,పి సత్యనారాయణ,నాయకులు బి యాదగిరి,జె రాములు, ఎస్.కె అజీజ్,జె వెంకటరమణ, బి లింగం,వి భూమయ్య,జీ.రాములు, కళమ్మ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికై మొదటిసారిగా మల్కాజ్గిరి కి వచ్చిన సందర్భంగా ఉమా మహేష్ గారిని సన్మానించడం జరిగిందని తెలిపారు.

## కాలనీవాసులను బెదిరిస్తే తాటతీస్తా : మధుయాష్కీగౌడ్..

### ఎల్బీనగర్ లో రౌడీయిజం నడవనివ్వను



**వనస్థలిపురం. జూన్. 24.ప్రభాతవార్త**

కాలనీ వాసులపై బెదిరింపులకు పాల్పడితే తాటతీస్తానని, ఎల్బీనగర్లో రౌడీయిజాన్ని కొనసాగినివ్వనని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కరించిన నేపథ్యంలో మధుయాష్కి గౌడ్ ని.. హయత్నగర్ డివిజన్ కమలానగర్, ఆంధ్ర కేసరి నగర్ కాలనీ వాసులు ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ప్రైవేట్ వ్యక్తులు వేసిన కేసుల కారణంగా సాహెబ్ నగర్ సర్వే నం. 2 నుంచి 8 వరకు ఉన్న ఆ కాలనీలలో రిజిస్ట్రేషన్ లపై కొన్ని నెలల కిందట స్టేటస్కో విధించడంతో కాలనీల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. తమ సమస్య పరిష్కరించాలని మధు యాష్కీ కి విన్నవించారు. కాలనీవాసుల సమస్యపై వెంటనే స్పందించిన మధుయాష్కీ ఇబ్రహీంపట్నం ఆర్డిఓ గారితో మాట్లాడి స్టేటస్కో ఎలా ఇస్తారని, వెంటనే ఎత్తివేయాలని చట్టపరమైన నిబంధనలు వివరించి సూచనలు చేశారు. ఈ క్రమంలో మూడు రోజుల కిందట ఆర్డీవో స్టేటస్కో ఎత్తివేయించడంతో మధుయాష్కీ గారిని కాలనీకి ఆహ్వానించిన ప్రజలు సన్మానాలు, సత్కారాలతో కృతజ్ఞతలు తెలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మధు యాష్కి మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా తాను పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలని ఎల్బీనగర్లో పనిచే స్తున్నాన ని పేర్కొన్నారు. ప్రజలు తమ కష్టార్జితంతో కొనుక్కున్న స్థలాలను 40 ఏళ్ల తర్వాత ఎవరో వచ్చి ఇది మా స్థలం అంటే.. ప్రజల మనోవేదన ఎలా ఉంటుందో తనకు తెలుసు అన్నారు. ఒక న్యాయవాదిగా ఈ రిజిస్ట్రేషన్ల సమస్యను ఎలా పరిష్కరించాలో ఆర్డీవోతో మా ట్లాడి తగిన సూచనలు ఇచ్చానన్నారు. ఈ క్రమంలోని రిజిస్ట్రేషన్ల నిలుపుదలపై స్టేటస్కో ఎత్తివేసి సమస్య పరిష్కారం అ య్యింది అన్నారు. సమస్య పరిష్కారమైన నేపథ్యంలో ఈర్ష బుద్ధితో కొందరు కాలనీవాసులపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. కాలనీవాసులపై బెదిరింపులకు పాల్పడితే తాటతీస్తానని, ఎల్బీనగర్లో రౌడీయిజం నడవనివ్వనని పేర్కొన్నారు. 24 గంటలు తాను అందుబాటులో ఉంటానని ఏ ఆపద వచ్చిన తనకి ఫోన్ చేయాలని కాలనీవాసులకు సూచించారు. ఈ క్రమంలో కాలనీ లోని మహిళా సంక్షేమ సంఘం, సీనియర్ సిటిజన్స్ ఫోరం, సంక్షేమ సంఘం ప్రతినిధులు.. మధు యాష్కికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. మాటలు చెప్పడం కాకుండా, పది రోజుల్లోనే మధుయాష్కీ గారు సమస్య పరిష్కరించి చేతల్లో చూపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, హయత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్, మార్కెట్ కమి టీ డైరెక్టర్ పాశం అశోక్ గౌడ్, నాయకులు పట్లోళ్ల మాధవరెడ్డి, భీమి డి రామ కృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షులు టీవీ రావు, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి దివాకర్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, మహిళ అధ్యక్షురాలు పూలమ్మ, మదన్ రెడ్డి, సారంగం , అడ్వకేట్ వెంకటేశ్వర్లు, వేణు గౌడ్ పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి : అంజనీకుమారి

**మలక్ పేట ,జూన్ 24, ప్రభాతవార్త:**

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని సిటీ స్మాల్ కాజెస్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ పివిపి అంజని కుమారి పేర్కొన్నారు. వావ్ మ్యూజిక్ సీజన్ 3 సంగీత రాగాల మధుర సందడి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతంపై ఆసక్తి కలిగిన మహిళలకు ఒక చక్కటి వేదికను కల్పిస్తూ వారిలోని ఓ అద్భుతమైన ప్రతిభ ను కొనసాగించడానికి వారికి తోడ్పాటును అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఎంతోమంది గాయని, గాయకులకు అవకాశం కల్పిస్తూ ముందు సాగుతున్నారని నిర్వాహకులు వెంకట్ లక్ష్మిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటలక్ష్మి, నిర్మాత, దర్శకులు విజయ కుమార్, గాయకులు సిరి, శ్రీనివాస్, లక్ష్మి రత్నం , ఆనంది, రమణి, శ్యామల, అప్పన్న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంజనీ కుమారిని సన్మానిస్తున్న నిర్వాహకులు వెంకట లక్ష్మి తదితరులు

## వైశాలినగర్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ వైశాలి నగర్‌లో రూ.10.10లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఎఇ శిరీష, కాలనీ వాసులు చెన్నకృష్ణారెడ్డి, ఎనుముల రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు



భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న దుర్గానంద పూరి స్వామీజీ

**సైదాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** శంకేశ్వర్ బజార్‌లోని శ్రీరామ భక్త హనుమాన్ దేవాలయంలో వీర సావర్కర్ భజన మండలి ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న భజన కార్యక్రమం 500 వారాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేవాలయంలో హనుమాన్ చాలిసా పారాయణం, భజన, హారతి తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి కాశీ విశ్వనాథ పీఠాధిపతి దుర్గానంద పూరి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డితో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దొంగిలించబడిన 3.5 కోట్ల విలువైన 1130 మొబైల్స్ ఫోన్ల స్వాధీనం

**నేరెడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, జూన్ 24 ,ప్రభాతవార్త**



దొంగిలించబడిన మొబైల్ ఫోన్లను కొనడం గాని అమ్మడం గాని చేస్తే నేరమని,అందుకు శిక్షాహరువులు అవుతారని రాచకొండ సిపి సుధీర్ బాబు పేర్కొన్నరు. మంగళవారం నేరే డుమెట్ కమిషనరేట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో రెండు నెలల వ్యవదిలో పోగొట్టుకున్న 3.5 కోట్ల విలువైన 1130 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలి పారు. రాచకొండ ప్రత్యేక బుందాలైన సిసిఎస్ ఎల్బీనగర్ మల్కాజ్గిరి భువనగిరి ఐటీ సెల్ సహాయంతో, మొబైల్ ఫోన్లను రికవరీ చేయ డానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సి ఈ ఐ ఆర్ పోర్టల్ తో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 76 మల్కా జిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 312 బోనగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 112 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సంవ త్సరం రాచకొండ పోలీసులు దాదాపు 3694 మొబైల్ ఫోన్లను రికవ రీ చేశారు. దొంగిలించబడిన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను నిజ మైన యజమానులకు రాచకొండ నేరే డ్ మెట్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం లో అందీయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సెల్ఫోన్ యజమానులు తమ అభిప్రాయాలను సిపి సుధీర్ బాబు ముందు వెలిబుచ్చారు. అదేవిధంగా రాచకొండ పోలీసుల పనితీరుపై వారి అభిప్రాయాన్ని స్వీకరించారు. మొబైల్ ఫోన్లలో నిల్వ ఉన్న విలువైన సమాచారాన్ని జాగ్రత్త గా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు.శబాష్ రాచకొండ పోలీసులు:సెల్ ఫోన్ యజమానులు విలువైన సమాచారంతో కూడిన తమ మొబైల్స్ ను తిరిగి రాచకొండ పోలీసులు తెచ్చి ఇవ్వడంతో వాళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోలీస్‌ల పని తిరుకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు.. రాచకొండ పోలీసుల పనితీరును ప్రశంసించారు. నేరాల నియంత్రణ అధికారి డిసిపి అరవింద్బాబు, ఏసీపి కరుణాసాగర్, ప్రత్యేక బృందాల సిసి ఎస్, ఐ టి సెల్ అధికారులను సుధీర్ బాబు అభినందించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి మొబైల్ వాడకం విధిగా మారిందని అన్నారు. సెల్ఫోన్ బిల్లులు లేకుండా ఫోన్లను కొనుగోలు చేయవద్దని వినియోగదారులకు సూచించారు. మొబైల్ పరికరం వినియోగదారులు తమ వ్యక్తిగత డాటాను జాగ్రత్తపరచుకోవాలని సూచించారు. ప్రయాణంలో, రద్దీప్రాంతాలలలో తమ వెంట ఉన్న మొబైల్ ఫోన్లను సరిగ్గా భద్రపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా తమ మొబైల్ డేటా గాని, విలువైన సమాచారం గానీ దొంగిలించబడకుండా బలమైన భద్రత పాస్వర్డను పెట్టే విధంగా సెట్టింగ్ చేసుకోవాలని తెలిపారు. తమ మొబైల్ దొంగిలించబడిన పోయిన వెంటనే విలువైన సమాచారాన్ని కోల్పోకుండా ఉండటానికి బ్యాకప్ డేటాను ఎప్పటికప్పుడు రూపొందించుకోవాలి అని సూచించారు.

## పీర్జాదిగూడ కమీషనర్‌కి సాయిప్రియ కాలనీవాసుల వినతి



**మేడిపల్లి, జూన్ 24 ప్రభాతవార్త ;** పీర్జాదిగూడ నగర పాలక సంస్థ 3వ డివిజన్ సాయిప్రియ కాలనీలో మోలిక సదుపాయలు కల్పించాలని మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సాయి ప్రియ కాలనీ అధ్యక్షుడు పులగం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నగర కమిషనర్ త్రిలేశ్వర్ రావు కి వినతిపత్రం అందజేశారు.కాలనీలో 600 పైగా కుటుంబాలు నివాసముంటున్న అక్కడ కనీస వసుతులు లేవని, డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్, రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నరని కమీషనర్ త్రీల్లేశ్వర్ రావు కి వినతి పత్రం అందజేసినట్లు సాయిప్రియ నగర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలు గుర్తించి త్వరితగతిన డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి వసతి పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.రంజిత్ కుమార్, సాగర్ చారి, రమేష్ చారి. ఆర్. రమేష్, దయాకర్ రెడ్డి, శంకర చారి. జి. నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరి మనిషి గవర్నర్ బండారు దత్తాత్రేయ : దడువై రాఘవేందర్

**మలక్ పేట ,జూన్ 24, ప్రభాతవార్త:**



గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా ప్రజల కదే నా ఆత్మకథఖి పుస్తకాన్ని అందుకుంటున్న ప్రముఖ వ్యాపారస్తులు దడువై రాఘవేందర్ తదితరులు

ప్రజలందరి మనిషి గవర్నర్ బండారు దత్తాత్రేయ అని మహారాజ్ గంజ్ శ్రీ సావిత్రి కన్య ఉన్నత పాఠశాల అధ్యక్షులు, మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ ప్రముఖ వ్యాపారవేత్త దడువై రాఘవేందర్ పేర్కొన్నారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ యొక్క ఆత్మకథ ఖిప్రజల కదే నా ఆత్మకథఖి పుస్తకాన్ని గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వహస్తాలతో వారికి అందజేశారు. ఈ సందర్భంగా దడువై రాఘవేందర్ మాట్లాడుతూ గవర్నర్ బండారు దత్తాత్రేయ యొక్క ఆత్మకథ పుస్తకం ఖిప్రజల కదే నా ఆత్మకథఖి పుస్తకాన్ని వారి స్వహస్తాలతో తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని, వారు కలకాలం ఆయురారోగ్యాలతో ఉండాలని, నిరంతరం ప్రజల సేవ, దేశ సేవలో ఉండాలని ఆకాంక్షించారు.

## ఎమ్మెల్యే ని కలిసిన కాలనీ వాసులు



**వనస్థలిపురం. జూన్. 24.ప్రభాతవార్త**

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కమల నగర్ కాలనీవాసులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో ఒక ప్రైవేట్ వ్యక్తి అట్టి కాలనీ స్థలం నాదే అని ఆర్.డీ.ఓ.కార్యాలయం నుంచి స్టేటస్ కో ఆర్డర్ కాపీ తీసుకొని వచ్చిన నేపథ్యంలో మేము వెంటనే సుధీర్ రెడ్డి గారిని సంప్రదించడం జరిగింది.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి గారు అట్టి కాలనీ నందు ఎన్నో సంవత్సరాల నుంచి అక్కడే జీవనం సాగిస్తున్నారు అని ఆర్.డీ.ఓ.గారికి తెలిపిన నేపథ్యంలో ఆర్.డీ.ఓ.గారు సుధీర్ రెడ్డి గారు కోరిన విధంగా స్టేటస్ కో ఎత్తివేయడం జరిగింది.దానిలో భాగంగా కాలనీవాసులు సుధీర్ రెడ్డి గారిని కలిసి సన్మానించారు.ఇట్టి స్టేటస్ కో ఎత్తివేసిన విషయంలో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు సన్మానం చేయించుకుంటున్నారు అని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇట్టి కాలనీ సమస్య కేవలం సుధీర్ రెడ్డి గారి వల్లే పరిష్కారం అయింది అని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో భారస పార్టీ సీనియర్ నాయకులు మిట్టకంటి.సత్తిరెడ్డి,కాలనీవాసులు టీ.వి.రావు,సుబ్బారావు,గణేష్,ఉపేందర్ రెడ్డి,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బాక్స్ డ్రైనేజ్ లైన్ పనులు పరిశీలించిన జోనల్ కమిషనర్




పనులను పరిశీలిస్తున్న హేమంత్‌కేశవ్‌పాటిల్

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ సమతాపురికాలనీలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, సరూర్‌నగర్ ఉపకమిషనర్ సుజాతతో కలిసి కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ మంగళవారం బాక్స్ డ్రైనేజ్‌లైన్ పనులను పరిశీలించారు. నాగోల్ ఇన్నర్ రింగ్‌రోడ్ నుంచి న్యూనాగోల్ రోడ్ నెంబర్ 10 వరకు రూ.98 లక్షల వ్యయంతో వర్షపు నీటికాలువ బాక్స్ డ్రైనేజ్‌లైన్ పనులు జరుగుతున్నాయి. సమతాపురికాలనీ లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు వస్తున్నారని, రోడ్‌నెంబర్ 2,3,4లో నూతన పైప్‌లైన్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని జోనల్‌కమిషనర్‌ను కార్పొరేటర్ కోరగా రూ.82 లక్షల వ్యయంతో 600 ఎంఎంఆర్ సిసి నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు జోనల్ కమిషనర్ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. రాఘవేంద్రకాలనీలో నిర్మించిన స్ట్రాం వాటర్ పైప్ లైన్‌ను పరిశీలించారు. కాలనీలో నూతన సీసీ రోడ్డు నిర్మాణనికి రూ.50 లక్షల అంచనాలతో నిధులు మంజూరు చేస్తామని జోనల్‌కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డిఈ చందన, ఏఈ షరీఫ్, వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, కాలనీవాసులు శ్రీనాథ్, నాయకులు మంచి రాజేష్, సుందర్ నారాయణ, వెంకట్‌రెడ్డి, విజయగౌడ్, లావణ్య, పింకీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు వెంటనే పరిష్కరించండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న నరసింహగుప

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** చైతన్యపురి డివిజన్ మునిసిపల్ కాలనీలో వాటర్‌లైన్, కొత్త రోడ్స్ లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు స్థానిక కార్పొరేటర్ రంగ నర్సింహా దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ మంగళవారం అక్కడికి వెళ్లి సంబంధిత అధికారులను పిలిపించి వెంటనే పనులు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం రవివర్మ, ఇన్స్పెక్టర్ సురేందర్, జవాన్ శ్రీకాంత్, కాలనీవాసులు శ్రీహరి, బీజేపీ డివిజన్ నాయకులు రుద్రారపు శంకర్, నరేందర్‌రెడ్డి, అర్జున్‌సింగ్ పాల్గొన్నారు.